క్లుప్తంగా

మల్లన్న అన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి నిత్యాన్నదానానికి దాసరి శేఖర్ ప్రశాంతి దంపతులు రూ.50,116 విరాళాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్త శ్రీనివాస్, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- భవన నిర్మాణ కార్మిక సంఘం నేత శ్రీశైలం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అమరులైన కార్మికులకు కుటుంబాలకు అండగా నిలుస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం భరోసా ఇచ్చారు. సోమవారం చిన్నకోడూరులో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. హక్కుల సాధనకు కార్మికుల పక్షాన పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం అమరులైన కార్మికులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యవర్గాల ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న పల్లె రాజు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ మానవ హక్కుల కమిటీకి చెందిన ఆయా మండలాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధి పల్లె రాజు, జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం చిన్నకోడూరులో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడుగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, రూరల్ మండల అధ్యక్షుడుగా రాములు, నారాయణరావుపేట మండల అధ్యక్షుడుగా బండారు స్వామిని నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- బీజేపీ నేత జయశ్రీ



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జయశ్రీ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ ప్రభారి బొమ్మ జయశ్రీ డిమాండ్ చేశారు. సోమవారం రైతుల సమస్యలపై బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రవి, సత్యనారాయణ, రామచంద్రం, రమేశ్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నారాయణ రెడ్డి

హుస్నాబాద్: ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో సీవీ రామన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించారు. ఈ అబ్యాస్ ఐఐటీ, నీట్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంక్‌లను సాధించారు. మొత్తం 8 మంది 12 పతకాలు సాధించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్తల ద్వారా పతకాలు స్వీకరించినట్లు హెచ్‌ఎం కాయిత నారాయణ రెడ్డి తెలిపారు.

1930కు ఫిర్యాదు చేయాలి

- సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: సైబర్ నేరం, మోసాలు జరిగి వెంటనే బాధితులు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని పోలీసు కమిషనర్ అనురాధ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. సైబర్ మోసాల్లో రూ.1లక్షలోపు పాగొట్టుకున్న వారు నేరుగా వచ్చి దరఖాస్తు ఇవ్వాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య



దుబ్బాకరూరల్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బెజ్జంకి(సిద్దిపేట): రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య పిలుపునిచ్చారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,203, గ్రేడ్ బీ రకానికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ అంజయ్య, ఏఓ సంతోష్, ఎంపీఓ విష్ణు, ఏపీఎం నర్సయ్య, ఏఎంసీ కార్యదర్శి వెంకటయ్య, సూపర్‌వైజర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ధర్మారం, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని అక్బర్‌పేటలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రంచేసి తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, రైతుల అక్కౌంట్లో డబ్బులు జమ చేస్తారని చెప్పారు. ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నిర్మల, ధర్మారం మాజీ సర్పంచ్ గూళ్ల పుష్ప, అక్బర్‌పేట మాజీ సర్పంచ్ ధర్మారం స్వరూపాబుచ్చయ్య పాల్గొన్నారు.

తేమశాతం 17కు మించొద్దు..

గజ్వేల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ సూచించారు. సోమవారం మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తేమశాతం 17కు మించకుండా ఉండాలన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ బాలయ్య, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మహిపాల్, ఏఈఓ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మిమోసపోవద్దు

తొగుట(దుబ్బాక): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్ సూచించారు. మండలంలోని బండారుపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అలాగే రాంపురంలోను కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ మోహన్, పీఆర్ ఎఈ రామకృష్ణారెడ్డి, ఎపీఎం మగ్దూం అలీ, పీఏసీఎస్ గంగారెడ్డి, ఏఈఓ రాజేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని అప్పనపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం దాకయ్య మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీఓ నరేందర్‌రెడ్డి, సెక్రటరీ దీపిక, ఏఈఓ చైతన్య, సీసీ ఆనంద్, వీఓ అధ్యక్షురాలు లత, సౌందర్య, రైతులు పోచాద్రి, యాదగిరి, మల్లారెడ్డి, రాజు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 11వ తేదీ వరకు ..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్, చాట్లపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



బెజ్జంకి(సిద్దిపేట): కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య



మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మారంలో ఎంపీడీఓ గణేష్ రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం పలు గ్రామాల్లో ఆయిల్ ఫామ్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): పీఏసీఎస్ ఆధ్వర్యంలో వర్గల్‌లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ అన్నపూర్ణ, పీఏసీఎస్ అధికారి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొద్దుతిరుగుడు రైతును ఆదుకోవాలి

- కొనుగోళ్లు పునరుద్ధరించండి
- రైతులకు బీఆర్‌ఎస్ సంఘీభావం



పొద్దు తిరుగుడు పంటను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేటజోన్: పొద్దు తిరుగుడు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సుడా డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పొద్దు తిరుగుడు కొనుగోళ్లకు సంబంధించి కోటా విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొనుగోలుకు సంబంధించి కేంద్రం కోటా ముగియడంతో సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో అధికారులు కొనుగోళ్లు చేయడం లేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ కొనుగోళ్ల కోటా విడుదల చేయాలని, పంట కొనుగోళ్ల ప్రక్రియ పునరుద్ధరించాలని లేకపోతే రైతుల తరపున బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

రైతులు ఆందోళన పడొద్దు

మరో మూడు రోజుల్లో పొద్దు తిరుగుడు పంట కొనుగోళ్ల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని జిల్లా మార్క్ ఫెడ్ డీఎం క్రాంతి పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 15,287 క్వింటాళ్ల పంట కొనుగోలు చేసినట్టు చెప్పారు. అదనంగా కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వ కోటా అనుమతి విషయంలో ఉన్నతాధికారులను కోరినట్టు ఆమె పేర్కొన్నారు. ఈనెల 4న కొనుగోళ్లు పునరుద్ధరిస్తామని, రైతులు ఆందోళన పడొద్దని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



శ్రీధర్(ఫైల్)

దుబ్బాకటౌన్: నాలుగు రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దుబ్బాకలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన అల్లి శ్రీధర్(26) ఓ కిరాణా దుకాణం నిర్వహించుకుంటూ జీవనం సాగించేవాడు. శ్రీధర్ గత శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గంగరాజు వివరణ ఇచ్చారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సైదా చెప్పారు. ధర్మారెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో వలంటీర్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీ, పాస్‌వర్డ్‌లను అపరిచితులకు చెప్పవద్దని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

అభిలాష్ రెడ్డికి ఆదియోగి అవార్డు



అవార్డులతో సిద్దిపేట విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ చూపిన సిద్దిపేట విద్యార్థి అభిలాష్ రెడ్డికి ఆదియోగి అవార్డును అందజేశారు. రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడలో సోమవారం జరిగిన కల్చరల్ డాన్స్ ఫెస్టివల్‌లో నాట్యమయూరి కూచిపూడి అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు నటరాజ స్వామి అవార్డులను ప్రధానం చేశారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు చేతన్



హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు చేతన్

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక ఆరె చేతన్ జాతీయ స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వరకు బిహార్ రాష్ట్రంలో జరుగుతున్న హ్యాండ్‌బాల్ పోటీల్లో చేతన్ తెలంగాణ జట్టు తరపున ఆడనున్నారు. చేతన్ ఎంపికపై జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కందుకూరి ఉపేందర్ గుప్తా, దామెర మల్లేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు కోత.. మృత్యువాత..

- ప్రమాదకరంగా రోడ్డు
- భయం భయంగా ప్రయాణాలు
- పట్టించుకోని అధికారులు



చౌటపల్లి క్రాస్ వద్ద కోతకు గురైన రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని చౌటపల్లి క్రాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. హుస్నాబాద్ నుంచి చౌటపల్లి గ్రామానికి వెళ్లే ఈ రహదారిలోని చౌటపల్లి క్రాస్ వద్ద రోడ్డు కోతకు గురైంది. దాదాపు 6నెలలు క్రితం కురిసిన వర్షాలకు ఈ రోడ్డు కోతకుగురికాగా చౌటపల్లి నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోజురోజుకు మరింత కోతకు గురవుతోంది. ఏ మాత్రం ఆదమరుపుగా ఉన్నా ప్రమాదాల బారిన పడతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆ పార్టీలను నమ్మి మోసపోవద్దు

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దౌల్తాబాద్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుక్కలు, నక్కలు అని సంబోధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే ఎంపీగా గెలిచి దుబ్బాక అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ 14సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, శ్రీనివాస్, విభూషణ్‌రెడ్డి, బాలేశ్ గౌడ్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ

ఆర్డీఓ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: ఎన్నికలను పాదర్శకంగా నిర్వహించేందుకే పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ, హుస్నాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నియోజకవర్గంలోని పోలింగ్ అధికారులకు సోమవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి విడత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామ్మూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు 546 మంది పోలింగ్ అధికారులకు నాలుగు షిఫ్టుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునే వారు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రామ్మూర్తి హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ట్రైనర్స్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంవల్లే ఆవు మృతి

- పాడి రైతుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మర్కూక్(గజ్వేల్): పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో వైద్యం అందించకపోవడం వల్లే పశువులు మృతి చెందుతున్నాయని వివిధ గ్రామాల పాడి రైతులు మండల కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని మండల కార్యాలయానికి అప్పగించారన్నారు. దీంతో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పశువైద్య కేంద్రంగా మార్చడం వల్ల పశువులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే మర్కూక్‌కు చెందిన పాడిరైతు శ్రీకాంత్‌రెడ్డికి చెందిన పశువు మృతి చెందిందని, సుమారుగా రూ.లక్ష నష్టం జరిగిందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

యువకులే సారథులు.. వారధులు

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

సిద్దిపేటజోన్: ఎంపీ ఎన్నికల్లో యువకులే ప్రచార సారథులు, వారధులని, వారే కీలకపాత్ర పోషించాలని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ పార్టీ సోషల్ మీడియా వారియర్స్, యువత, విద్యార్థి విభాగం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల అసత్య ప్రచారాలను సోషల్ మీడియా వారియర్స్ తిప్పికొట్టాలని సూచించారు. ఎంపీగా విజయం సాధిస్తా, గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రైతులకు అదనపు ఆదాయం

ఏఓ నాగరాజు



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏఓ నాగరాజు

హుస్నాబాద్‌రూరల్: రైతులు పొలాల గట్లపై పెంచుకోనే మొక్కలను నర్సరీల్లో పెంచాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఆదేశించారు. సోమవారం తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రతియేటా మొక్కలను పెంచుతున్నామని వాటిలో వ్యవసాయ భూముల గట్లపై టేకు, కొబ్బరి లాంటి మొక్కలను పెంచితే రైతులకు పంటల దిగుబడులపై వచ్చే ఆదాయంతోపాటు అదనంగా కలప నుంచి ఆదాయం వస్తుందన్నారు. పొలాల గట్లపై మొక్కలను పెంచడం వల్ల వాటి ఆకులు రాలి పొలంలో మురిగిన తర్వాత సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు హారిక తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మేధో సంపత్తితో ఎన్నో ప్రయోజనాలు

ములుగు(గజ్వేల్): మేధో సంపత్తి హక్కులు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చుతాయని ప్రముఖ రిసోర్స్ పర్సన్ అశోక్ దొప్పలపూడి అన్నారు. ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో సోమవారం మేధోసంపత్తి హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులు(ఐపీఆర్) కింద ఆవిష్కర్త కాపీరైట్‌లు, పేటెంట్లు, డిజైన్, ట్రేడ్‌మార్కులు వ్యాపార రహస్య రక్షణను పొందవచ్చునన్నారు.

◆ టెట్ పరీక్షఫీజు తగ్గించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): చాల కాలం తర్వాత నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫీజును తగ్గించాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఏర్పుల మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కొమురవెల్లిలో మాట్లాడుతూ అధిక ఫీజుతో నిరుపేద టెట్ అభ్యర్థులకు పెనుభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండు పేపర్లకు రూ.2000లకు పెంచడంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి ఫీజు తగ్గించాలని కోరారు.

◆ 'విజయ' సహకార సంఘం చైర్మన్ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాల గ్రామ విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన చైర్మన్ ఎన్నిక సోమవారం జరిగింది. గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ భవనంలో జరిగిన ఎన్నికలో నూతన చైర్మన్‌గా ఉత్కం సత్యనారాయణగౌడ్ ఎన్నికై నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

◆ ఇన్‌చార్జి ఎంఈఓగా శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మండల ఇన్‌చార్జి ఎంఈఓగా కొండపాక ఎంఈఓ పి.శ్రీనివాస్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించిన మొగుళ్ల నర్సింహ్మా రెడ్డి పదవి విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీచేశారు.

◆ అంబేద్కర్ వల్లే మహిళలకు ఆస్తిహక్కు

హుస్నాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం భారత రిజర్వ్ బ్యాంక్ 89వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పించాలని పార్లమెంట్‌లో అనేక సార్లు ప్రసంగించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అంబేద్కర్ కృషి ఫలితమేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్ సరోజన, నర్సాగౌడ్ వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

◆ మద్యం పట్టివేత

కొమురవెల్లి(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అయినాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న నాలుగు కాటన్ల బీర్లను అధికారులు పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ నాగరాజు వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

వర్గల్(గజ్వేల్): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, చిత్తశుద్ధితో సేవలందిస్తే తగిన గుర్తింపు దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండలం నెంటూరు జెడ్పీహైస్కూల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు నూక లింగమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సభలో వర్గల్ విద్యాసరస్వతి ఆలయ అధ్యక్షుడు దాచేపల్లి వెంకటకృష్ణారావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శశిధర శర్మ, మల్లికార్జున్, వలీఅహ్మద్, ఖరీముద్దీన్ తదితరులు ప్రసంగించారు. హెచ్‌ఎం కనకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ తాళం వేసిన ఇళ్లలో చోరీ

సిద్దిపేటరూరల్: తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లిన వారి ఇళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అపూర్వరెడ్డి వివరాల ప్రకారం తోర్నాల గ్రామానికి చెందిన వల్లెపు ఉషశ్రీ, వల్లెపు లక్ష్మి ఆదివారం బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఆదివారం రాత్రి దొంగలు ఉషశ్రీ ఇంటి తాళాలను పగులగొట్టి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. వల్లెపు లక్ష్మి ఇంటి నుంచి ఏడున్నర గ్రాముల బంగారు అభరణాలు, రూ.40వేల నగదు, 70 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్ళారు. సోమవారం తిరిగివచ్చిన వారిద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ గోటి తలంబ్రాల దీక్ష

దుబ్బాకటౌన్: స్థానిక బాలాజీ దేవాలయంలో భద్రాచల గోటి తలంబ్రాల దీక్షను భక్తులు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ కోటి భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం దాదాపు వంద మందికి పైగా భక్తులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

◆ కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలు పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్

ములుగు(గజ్వేల్): బీఆర్‌ఎస్ పార్టీ నుంచి నాయకులు పార్టీలు మారినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని ములుగు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్ అన్నారు. వంటిమామిడిలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లోని చెత్తాచెదారం వెళ్లి పోవడానికే కేసీఆర్ గేట్లు తెరిచారని, అలాంటి వారిని ప్రజలు ఓడించాలని సూచించారు. ఆయన వెంట బాబుగౌడ్, వెంకట్‌గౌడ్, మహేశ్‌యాదవ్ ఉన్నారు.

◆ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మద్దూరు(హుస్నాబాద్): గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్చకుడు పార్నంది ఆంజనేయశర్మ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.